

# మాస్టరు అంజి నిర్యాణము

(కార్తీక పూర్ణిమ)

డాక్టరు గోవిందరాజుల వెంకట సుబ్బారావుగారు, L. M. S.

ఇప్పుడే ఇంటికి వచ్చి దిగాలుపడి పడుకొని, దీనిని వ్రాయటానికి మొదలెట్టాను. ఆకాశంలో నేమో నిండుచంద్రుడు పరుగెత్తుకు పోతున్నాడు: వాడేమో ఉత్తరానికి; వెళ్లపోతూ మేఘాలు దక్షిణానికి. మా అంజిప్రాణాన్ని తనపొట్ట పెట్టుకున్నాడు వీడు. శల్యాలు మాకు వదలేసి, మహారసజీవి ఉసుర్లను లేవ తీసుకెళ్తున్నాడు. ఒకటే పరుగెత్తటం. రెండుగంటలయిం దిప్పటికి. ఆగమంటే ఆగడు. పొరపాటుపడ్డాడేమోనని నా ఆశ. వీడిని ఆపటం నాపనేమా? అయితే నాగతేమిటి? వాడితల్లి, బంధువుల గతేమిటి? మరి చాను, మా నాట్యసభ గతేమిటి? రేపు రాదూ ఆకాశంలోకి, నిలవేసి కక్కమంటాను. అయిపోయిందని మళ్లా తెల్లమొఖం వేస్తే ఏం చేసేది?

అయిపోయింది, బాబూ, అయిపోయింది. నేటితో ఋణం తీరిపోయింది. మళ్లా కనపడ్డుగా? నిజమేనా ఇదంతా? ఎవరు పోయినా ఇంతే కాబోలు!

కొన్నాళ్లక్రిందట, నేను పోతాను; అప్పుడు మా అంజి తప్పక నన్ను మోసేవాళ్లలో ఒకడను కొన్నాను. అదిటు, ఇదటు అయింది. నిజంగా దేవుడనేవా డొకడున్నాడా? లేక ఉంటే నిద్రపోతున్నాడా!

నాదా, పెద్దజబ్బాయె! పీడిదా, జ్వరంతో మొదలెట్టి: రాను రాను క్షయ: దాని త్రాడు తెంచుకొని, పేగుల్లో మొదలెట్టింది. నాకు ప్రాణాన్నిచ్చిన రంగాచారిగారి కత్తికి ససేమిరా అంది. కాని భయపడి మూడునెల్లు, మూలపడి మూలిగింది. అప్పు కర్మవ్యాధి కాబట్టి, భాద్రపదంలో మొదలెట్టి వీడి ఉక్కుశరీరాన్ని పీల్చి పిప్పి చేసి, ఈలలితహృదయాన్ని తిని తిని, వదిలి పెట్టక తీసికెళ్లిపోయింది.

ఇంతకన్న ఏం చేస్తుంది? అర్థం శుభం, అన్నం పున్నం ఎరగని ఈ బ్రహ్మచారిని దేనికి తీసుకెళ్లింది? ఉత్తమజన్మ మొదలెట్టించటానికా, లేక జన్మరాహిత్యం చెయ్యటానికా? ఏమో! ఉత్తమజన్మ అంటాం గాని, అది మళ్లా ఉత్తరానికి దక్షిణమే కాదు బాబూ! జన్మరాహిత్యానికే మా అంజిని పరమేశ్వరు డార్పేశాడు. నాకు తెలిసినంతవరకు ఏపాపం చెయ్యని ఈ చిన్నవాడిది ఆఖరుజన్మే! ఏమైనా ఉంటే తనఆరుకళలశోభతో కర్మ ననుష్ఠించాడు. ఋణం తీర్చుకొన్నాడు: బాకీలు మిగుల్లు లేవు.

వెళ్లిపోయినా డనంతంలోకి; పరమేశ్వరుడి నిత్యనాటకభవనంలోకి. నాయినా! నీలలితకళల్లోను, నీసహజ సుగుణాల్లోను, నీ ఉన్నతభావాల్లోను, నీ భక్తిలోను,

నీపారవశ్యంలోనూ మునిగి తేలుతూ, ఆనందమయుస్వరూపుడవై అక్కడ్నే నృత్యం చేస్తూ ఉండు. కొన్ని యుగాలకైనా నిన్ను చూస్తాలే! నీ ప్రేమ కర్పణం ఈ హృదయమే; దాన్నయినా తీసుకెళ్లు!



శ్రీ తంగిరాల ఆంజనేయులుగారు, (మాస్టరుఅంజి)

మొదలుకొద్దాం. మా అంజిగాడ్ని నేను ఎస్సే చదువుతున్నప్పుడు మొదట చూట్టం. మేమప్పుడొక ప్రాంతవిద్యార్థిసంఘాన్ని పెట్టి, దాని సంవత్సరోత్సవానికి గయోపాఖ్యానం ఆడటానికి రిహార్సల్లు వేస్తున్నాం. నేనేమో భీముడు, సాత్యకి వేషాలు వేశేరోజులు. వీడ్నొకరోజున వాడి మేనమామ పిల్లలమర్రి సుందరరామయ్యగారు, వెంట తీసుకొచ్చి, "నామేనల్లు" డన్నారు. "పాడరా అబ్బాయి" అంటిని. ఆరోజుల్లో పద్యం పాడితేనే ఘెడ్డగొప్ప. ఏం చేశాడూ! హార్మణీ నొక్కమని సవాల్ చేసి నదురూ బెదురూ లేకుండా 'నరకాసుర'లో సీసపద్యం ఒకటి పటాక్షేపంతో అభినయించి పనిచేశాడు. "మమ్మనందర్నీ మించుతావురా, కొద్దిరోజుల్లో" అని మనసార వెర్రిగా దీవించాను. దగ్గరున్నవాళ్ల కొంచెం మనస్సు కలుక్కుమనటం తయింది. ఏ అవస్థలో అన్నానో కాని కొన్నాళ్లకు మమ్మనందరినీ మించిపోయ్యాడు. రామవిలాస సభలో కుప్రకారులో ఇంతపైకి వచ్చింది వీడేనని వేరే వ్రాయక్కర్లేదు: ఆంధ్ర ప్రేక్షకలోకానికంతా తెలిసినవిషయమే.

వీడు ఏవిధంగా వృద్ధి చెందిందీ వ్రాయాలంటే చాల కష్టం. కొన్నిదశలు జ్ఞప్తికి తెచ్చుకోగలను కాని, దశలమధ్యఉన్న స్థితులు మట్టుకు చాత కావు. గారడీవాడు చెట్టు మొలిపించిన మోస్తరుగా పెరిగాడు: మళ్లా ఆగారడీవాడే సంచిలో వేసుకుని ఇతరచోట్ల చూపించటానికి తీసికెళ్లాడు. శ్రీరామవిలాససభ పూర్ణమైనవెలుగులోకి వచ్చేసరికి మా అంజికూడా పొడిచిననక్షత్రాల్లో ఒక తేజోవంతమైన నక్షత్రం. మబ్బులు కప్పి విచ్ఛిన్నమైనతర్వాత మరింతశోభలో ప్రకాశించాడు. అందరిచేతను "శహబాస్! చిచింద్రీ" అని అనిపించుకొన్నాడు. తనబీదతల్లి కక్కురకొచ్చేసరికి మాలదైవం మాయంచేసేసాడు. వీ డేకపుత్రు డాధీయంతురాలికి.

మొట్టమొదట చిల్లరవేషాల్లో ఆరితేరిపోయ్యాడు. ఏవేషమైనా అతిస్వాభావికంగా సూక్ష్మవిచారణతో వేసేవాడు. చాలమందికి వేషం స్వాభావికంగా ఉంటే చాత దానికి తగిన ట్టుండదు. రెండూ కుదరటం చాల కష్టం. అది కాక, వీట్లో అధికారం సంపాయించందే పెద్దవేషాలు చాలాకష్టం. చేతయినా అవి ఏదో, ఎక్కడో, పట్టిస్తూనే ఉంటాయి. ఇది నాఅనుభవం మీద చూసిన సంగతి. చిల్లరవేషాలు నమ్మకంగా, న్యాయంగా, జయప్రదంగా నటించటంలో పాద్యేదేమిటి? సిగ్గు—'శరం'—చిల్లర్లో ఉండే చిలుము. (చిల్లర్లో ఉండే చిలుం పోగొట్టుకోటం చేతయితే రూపాయికి మెరుగు పెట్టటం చేతవుతుందని నాఆశయం.) ఇక్వే, పెద్దవేషాల్లో మొదట్నే దూకేవాడికి ఎదురొచ్చే దయ్యాలు. అనగా అనగా దుష్యంతుడివేష మనుకోండి. మాచిన్నతనంరోజుల్లో పదిరాగాలు పదిపద్యాలమీన విసిరాడంటే ఇచ్చేసేవాళ్లు, పని ఎంత పేలగా ఉన్నా సరే. "ఉన్నవాళ్ళల్లో ఇంకెవరున్నారోయి, వాడే లే" అనేవాళ్లు పైగా. ఇలా రాజుగారి ముచ్చెల్లోకి కాళ్లొచ్చేసరికి,

అది ఎంత అసహ్యంగా ఉన్నా సరే, ఎంత తగనిదన్నా సరే, వేసుకొని తెయ్యిమనేవాడు. అదేలా ఉండేదీ నే నేరే చెప్పాలా? ముందర ముచ్చటలు తుడవటం చేత యితే తర్వాత అది వేసుకొంటే బాగుంటుంది. ఇదే విధంగా తలగుడ్డా దుస్తులూ అనుకోండి. ఎంతమందికో మోసం త్రిప్పటం చేతర్యేది కాదు. మూసైనా ఉండాలి లేక త్రిప్పైనా ఉండాలి; లేకపోతే ఏలా వస్తుంది?—గాథలోకి దిగాను—ఇక అసలు విషయం.

బొబ్బిలినాటకంలో మర్తెచువేషం మొదట నన్నాకర్షించింది. ఇంగ్లీషువాడిలాగా కాకుండా, ఫక్తు ఫ్రెంచివాడిలాగ వేషంలోనూ, భావంలోనూ, నడకలోనూ చూపించాడు. "ఎంత అవకాశాన్ని ముక్కట్టుకున్నావురా" అనుకొన్నా నాబుస్సీవేషంలోనుంచి.

కుర్రవాడని తెలిసి కూడా భాగవతుల రాజగోపాలంగారు, అప్పుడు సభ proprietor గారు, ఖుస్రూఖాన్ వేషం ఇచ్చేశారు. ఆరాత్రి ప్రతాపరుద్రీయంలో అతిముచ్చటగా, గాంభీర్యంగా అభినయించాడు. "పైకొస్తున్నాడు గొప్పనటుడు, కాచుకోండి పెద్దవాళ్లు" అనేవారు చూసినవాళ్ళంతా.

ఇలా ఉండగానే, అకస్మాత్తుగా స్త్రీవేషం కూడా ఒకమారు ధరించాడు; 'నరకాసుర' నాటకం; కొత్తఫక్కీగా తయారుచేశాం; సుందరరామయ్యగారు నరకాసురుడు; వీడేమో ఊర్వశి. స్టేజిలో ఎప్పుడూ ఉండేవాణ్ణి, ఎందుకో నాటకంరోజు పిట్టులోనే కూర్చుని మొదట్నుంచి, చూస్తున్నాను. ఒక మెరుపులాగా రంగంలోకి వచ్చాడు. ఆరోజున చూపిన అభినయం వర్ణనాతీతం. కంచుకం లేకుండా గులాబీసిల్కు చీర కట్టి తయారైనాడు. వేషం అప్సరస్త్రీలని మించిపోయింది. వాండ్లవద్ద ఉండే ఏదో యొక వెలుగూ, తళతళ, కళకళ, మబ్బులోనుంచి, గాలిలోనుంచి వస్తున్నట్లు జిలుగు గల్గి అంతకు మించినపోకడలతో వ్యవహరించాడు. అప్సర ఏవిధంగా నడవాలి? ఎవరికైనా తెలుసునా? తెలిసింతర్వాత నడవగల్తురా? వీడివద్ద వున్న కళలో ప్రాశస్త్య మేమంటే, ఏవేషమో ఆవేషంలో అంతా లీనమైపోయ్యేవాడు. అన్నట్లు "అంజి" అని ఎవరికీ చాలాసేపు గుర్తురాలేదు. గాలిలో నడిచినట్లు, నీళ్ళలో నిలువున యీదుతున్న కాళ్ళలాగా, లలితంగా, సుఖంగా, హాయిహాయి అనేలాగా, అంజ వేశాడు. మళ్లా అనడక నే నెక్కడ చూడలేదు. ప్రమీలవేషంలో కాకినాడ జగన్నాయకులు ఆఖరు సీనులో అర్జునుడినద్ద నిల్చున్నప్పుడు అలా నటించాడు. అది రమ్మంటే వచ్చేనడ క్కాదు: ఆసమయానికి స్త్రీచిత్త మైపోయి, దానిజిలిబిలి, దానిమిలమిల పట్టుపడాలి, లేకపోతే పట్టించుకోవాలి. సుందరరామయ్యగారు నిజంగా పారవశ్యములోకి వెళ్లాడు ఆరోజున. మేనల్లుడి అభ్యుదయము ఆయన్ని ఆనందబాష్పాలలో ముంచినది. మా సంగతి అంతకంటె. ఎందుకో జ్ఞాపకము రాకుండా యున్నది. మళ్లా ఆవేషం య్యాలేదు వీడు; వేస్తే ఆడవేషం అంబాజీపేట ఆముదములాగా తగులుకుంటుం దని నాతో చెప్పినట్లు లీలగా వుంది.

పోని, హాస్య ప్రాధాన్యమైన వేషాల్లో లేడా అంటే, వాట్లోను ఆరితేరి పోయ్యాడు. 'సోరాబురుస్తుము'లో కోర్టు ఫూలు వేషం అతిరమ్యంగాను, ముచ్చటగాను ఉండేది. ఈ సందర్భములో ఒకమాట చెప్పాలి వుంది. కండక్టరుగారు ఏదో యొక వేషం యిస్తారనుకోండి. రిహార్సల్సు వచ్చేటట్లు అయిపోతాయి; నాటకము అంతా తయారైపోతుంది; ఆరోజు రాత్రి హాలుదగ్గర ఏం పూసుకోవాలో, ఏం వేసుకోవాలో ఆలోచించడం మొదలు పెడతా రెంతమందో. లేదా, వీటిని దేవునికి వదలేసి ఉన్నవాటితో తయారౌతారు. రంగంమీదికి వచ్చే సరికి వేసింది ఆవేషమని తమకూ, ప్రేక్షకులకూ అర్థంకాకుండా మట్టుకు చేస్తారు. ఈకుర్రవాడు ఎన్నిరోజులముందరో తనవేషాన్ని ఆలోచించేవాడు. పర్షియన్ కోర్టు పూలుదుస్తులు, అతిజాగ్రత్తగా ఊహించి, పరిశీలించి, తూచి, ఆఖరుకు నమ్మి, కట్టించుకొన్నాడు. ఇంతశ్రద్ధాభక్తులతో తనవేషాన్ని భజించేటప్పుడు ఎవరికి ముద్దు రాదు, ఎవరిహృదయము వరవళ్లు దొక్కదు?

ఇదే విధంగా యింతకన్న అతిసూక్ష్మ విచారణతో 'అనసూయ'లో కష్టువాడి వేషం తయారైర్యే

వాడు. వేళ్ల వంకరటింకరలదగ్గరనుంచి, ఆ దుర్గంధపు పుండ్ల ఆకారమువరకు, నడకలోనూ, ముఖభావాలలోనూ, సకరుణంగా, అతిస్వాభావికంగా ఉండేవి. నన్నెప్పుడూ కుష్ఠుజబ్బునుకరించి అడిగియుండలేదు: వీడికీచాకచక్యం ఎలా పట్టుపడిందీ నాకర్థంకాలేదు. వీడిపుట్టుకలోనే కల్గియుండాలని ఎప్పుడు అనుకుండేవాణ్ణి. ఏదైనా క్రొత్తవేషం యిస్తే వెంటనే వాడి కండ్లెదుట ముందుగా తా నావేషంలో ఏలా వుండేదీ, వుండబోయ్యేది, నమ్మకంగా, తీర్చినట్లు, కనపడేది. దాన్ని వెంటనే ఒక ఛాయాపటం తీసి తన హృదయంలో పారేశేవాడు. తర్వాత దాని కావలసిన కృణాలద్గరనుంచి భిణాల వరకూ, జాగ్రత్తగా, పట్టుదలతోన, భక్తితోనూ, నేకరించేవాడు. దానిఫలితము యేలా పరిణమించేదీ ప్రేక్షకులకు చాలామందికి విశదమైన విషయమే.

ఇదంతా తలచుకునేసరికి నాకు "పూర్వ రామవిలాససభ" రోజులు జ్ఞాపకమువస్తున్నాయి. సందర్భం అది కాదు కాబట్టి దానిని గురించి వ్రాయను. దాని మొదటి అవస్థ "పూర్వ" లేక "అపూర్వరామవిలాససభ";—రెండవది, సభాపతిరాయు, సుందరరామయ్యగార్లు మాను కొన్న తరువాతది, "ఉత్తర రామవిలాససభ";—మూడవది, శిథిలమైన తర్వాత కొన్నాళ్ళకు పుట్టింది, "ఉత్తరోత్తర రామవిలాససభ." "ఉత్తర రామవిలాససభ" రోజుల్లో పైకి వచ్చిన నాటకం 'కన్యాశుల్కము'. దాంట్లోనే వీడు అభినవరామప్పపంతులై కీర్తి పొందాడు.

అప్పట్లోనే, అనగా పూర్వరామవిలాససభరోజుల్లోనే, గద్యనాటకాలు పైకి తేద్దామని, లేకపోతే వాటిని వ్రాయిద్దామని, 'మృచ్ఛకటిక', 'ముద్రారాక్షసము' మొదలైన సంస్కృతనాటకాలు సాధ్యమైనంతవరకు ఆరాధిద్దామని ఉన్నతోద్దేశాలు ఉండేవి: ఆచరణలో పెట్టటానికి అవకాశాలు ఉండేవి కావు: ఏదో వెధవ అవాంతరలతో కొట్టుకుంటూ ఉండేవాండ్లం.

ఆఖరుకు దీన్ని ఆడితీరాలని పట్టుపట్టినవాండ్లల్లోనే కొకడ్ని. పాత్రలు నిర్ధారణచేశాం: అసాధారణ గద్యనాటకం గాబట్టి ఊరకే రిహార్సల్సు కొట్టుకున్నాం. మూడోరిహార్సల్లో రామప్పపంతులువేషంగాడు బాగా అర్థంచేసుకున్నట్టు నాకు కనపించలే. మా 'అంజి' ఒకమూలగా కూర్చొని నాఅవస్థంతా చూస్తున్నాడు. వాడికండ్లు ఓరగా చూశాను. నా కావలశినదూకుడు కనబడ్డది: వెంటనే గ్రహించాను. "నాయనా! యీలా వచ్చి కుర్చీలో కూర్చొని, దిద్దుకోరా నీమధురవాణ్ణి" అన్నాను. వెంటనే కొంచెం ఆలోచనా సాలోచనా అభినయించి, అభిప్పించాడు. కొంచెము సాగేవరకే "వీడేరా యీవేషాని" కని అర్థమైపోయింది. దీనిని వీనికి మార్చి అసలువానికి మరొకటి సర్ది, సాగించాం.

మొదటి నాటకానికి యెనభై రూపాయిలు వచ్చినట్లు నా కింకా జ్ఞాపకం. బహుమానం తక్కువా, మాకు ఉత్సాహము ఎక్కువాగా యుండే నాటకం యిది. హాలు పూర్తిగా నిండిపోయింది: రక్తిగాను, జయప్రదముగాను నడిచింది, మొదటిసారి అనకుండా. రామప్పపంతులు వెంటనే ప్రేక్షకుల నాకర్షించేశాడు. ఇక మధురవాణిసంగతి వేరే చెప్పాలా? మా స్థానంవారి చిన్నవాడు తన నాట్యకళాకౌశలానికి అఖరు మెరుగు దిద్దేశాడు. రాను రాను యీనాటకం ఆంధ్రప్రేక్షకలోకాన్ని యెలా ఆకర్షించిందీ, తేటతెల్లమైనవిషయమే గనుక, నేను ఎక్కువగా వ్రాయక్కరలేదు. ఎప్పుడూ యిద్దరూ ఒకరి నొకరు మించాలని దూకేవారు నాటకంలోకి. మొదటిసీనుతోనే ఉడాయించేవాణ్ణి కనక, వెంకటేశంతో, మామగారియింట్లో నాబుచ్చమ్మభాగవతంలో కొట్టుకుంటూ ఉండేవాడ్ని. అయినా నిజమైన ప్రేమ మామధురానికే ఉండేది గనుక, విమానం ఎక్కి వచ్చి, సీనులచాట్నుండి గుటకలు మ్రింగుతూ, వీండ్లిద్దరినీ చూచేవాడ్ని. "తీరిపోయిందారా, యేం జేయమంటారు నన్ను". కసితీర యీనిర్యోగప్పంతులు అవస్థ చూసి చూసి బిగ్గరగా సంతోషించేవాడ్ని. కాని 'గాడిదా' సీను మొదల్లో మధురం తాంబూలము యిస్తూన్నప్పుడు వీడు కాళ్లు ఊస్తూ రాగం వెళ్లిరిసిపోయ్యేటట్టు రక్తి రసం కుప్పించేటప్పుడు నాకు "నిజంగా దీనికి వీడిమీద కూడా ప్రేమ కుదిరిందా" యని భయమేసేది, ఆఖరుకు సౌజన్యారావుపంతులింట్లోకి వచ్చి నామధురం నన్ను

బయటపెట్టి, కొత్త ప్రపంచాన్ని చూపించేవరకు, యీవిధంగానే వుండేది నాకు.

గిరీశాన్ని వదిలించుకొని ముచ్చట దీర వీడ్ని వల్లా చూస్తాను. బ్రహ్మచారైనా ఆరితేరిపోయిన రసికుల్ని మించిపోయ్యేవాడు, ఆ అకులందుకొనే సీనులో: ఉత్తరంలో 'గాడిద' అని చదువుతున్నప్పుడు, మధురం విరగబడి నవ్వేటప్పుడు, వీడు చూపించే దేబెతనం, అమాయికత్వం వర్ణనాతీతం—.

"దండిగిస్నకోస మొచ్చాను" అంటే, "తీసికెళ్లు" అని వీడు వంటనే, అదేస్థాయిలో జాణతనంతో అనేటప్పుడు ప్రతినాటకానికి గొల్లుమని చప్పట్లు యిచ్చేవారు. గిరీశంచేత నెత్తిమీద దెబ్బ తిన్న తర్వాత హనుమంతుడంత యెగిరేవాడు; నియ్యోగపుడా బుట్టిపడిపోతుండేది. వీడి "డేమేజీలు", "కోర్టులు" మరపురావు, బాబూ, మరపురావు! తిన్నది తిని, ఊసుపోక; అఖండ వైరివేటుగిరి చలాయిస్తూ; శాఖాచారం, మర్యాదా అని నలభైయేండ్లు పై చిల్లర నెత్తిమీదికి వచ్చినా, భోగంటోం పనోకత్తెను తగిలించుకొని; యింటా బయటా రోసి; మీసం మెలేస్తూ; పయికి పటారం లోపల లొటారంగా యుండే ఆకువేలతనం, వీడు బాగా గ్రహించాడు. ఆ నల్లలాంకోటు, తలగుడ్డ, మీసం, కిర్రుచెప్పులు ఎవ్వరికీ మరపురావు. చుట్ట చుట్టడంలోను, మణీబాక్సులోనిడబ్బు తీయటంలోను లక్షభావాలు కుప్పించేవాడు. "శ్మశానంపాట" వినేటప్పుడు సింహావలోకనంలో, "ఒకఅక్క ఉంది; అది యెప్పుడూ నా గుమ్మము మీద అడుగెట్టలేదు" అనుకొని లింగదేవానికి వెట్టు తిగిరేటప్పుడు అతిచక్కగా అభినయించేవాడు. వీడిరామప్పంతులువేషాన్ని గురించి యింతకంటె వ్రాయక్కరలేదనుకొంటాను. ఈవేషం ఒకటే చాలు, వీడికీర్తి ఎప్పుడూ చాటుతుండడానికి.

"మాష్టరు అంజి" అని ఎలా వచ్చిందని అడగ్గలరు. ఒకప్పుడు బందరు నాటకాలకని మాసభ వెళ్ళినప్పుడు వీడివేషాలన్ని మెచ్చి నాస్నేహితులు ఉబ్బూరి రామక్రిష్ణరావుగారు యీనామకరణము చేశారు. తర్వాత రాను రాను మాకూ, ఆంధ్రలో కానికీ అదే అలవాటయిపోయింది. ప్రతివాడు "మాష్టరు అంజి, మాష్టరు అంజి" అనేవాడు కాని యింటిపేరు మరచిపోయ్యారు: యింటిపేరు 'తంగిరాల', వీడిపేరు 'ఆంజనేయులు'.


తర్వాత కొన్ని సంవత్సరాలకి కొంతమంది స్నేహితులం కలసి "శ్రీనాట్యసభ" స్థాపించాం. వీడే దానికి నామకరణం చేసింది. అసల్లో తరచు 'కన్యాశుల్కము', 'కంఠాభరణము' 'ప్రతాపరుద్రీయము' ఆడేవారం. మా సభకని వీడు చేసిన కృషి, వీడు పడిన శ్రమనే నెన్నడు మరవలేను: మాసభికులు వీడిఋణము తీర్చుకొనేది గాదు, తీరేది కాదు. 'కంఠాభరణము' నాటకంలో సుబ్బలక్ష్మి వేషము అతిస్వాభావికంగా యుండేది. వేషంలో వీడిని పోలిన విధవావిడ్ని నేనొకమారు చూశాను. వీళ్లిద్దరికీ దేనిలోను భేదం కనుక్కోలేదు,—నడకలో సహా. "ఇదేమి ఘోరంరా" అంటే, "ఆవిడ్ని చూసే అంతా తయారైనాను" అన్నాడు.

పైన చెప్పిన నాటకాలు గాక, అప్పుడప్పుడూ, రాఘవాచారిగారు బెజవాడ వచ్చి నాటకాలు ఆడినప్పుడల్లా యేవో కొన్ని వేషాలు మాసభికులు వెళ్లి వేయటం ఆచారమైపోయింది. అప్పుడు ఒకమారు ప్రహ్లాద నాటకములో పాములవాడివేషం వేశాడు. నాజన్మలో అలా తయారైన వేషాన్ని నేను చూడబోను. తలగుడ్డ, గోచీ, నాగస్వరంబుర్ర, బొకళ్లు, నడకలు, నిజమైన యెరుకలవాడ్ని అనుకరించినవి. ఫోటో తీయించి ఉంచుదామనుకొన్నాను. యెందుకో అశ్రద్ధ అయిపోయింది. అకాలమరణం అని తెలియలేదు.

ఫిఫ్తుఫారం (fifth form) వరకే చదివినప్పటికీ, 'Hamlet'|లో ఒకమారు రెండో (Grave-digger) వేషం వేశాడు; కొత్తయినప్పటికి Irving Shakespeare లో బొమ్మలు చూచి వేషం తయారుచేసికొన్నాడు. ఉచ్చారణ, భావప్రకటన అతిరమ్యంగా కుదిరిపోయినయి. అందరూ, "Alround actor; వీడు మాకు, మాసభకు ఆభరణం" అన్నారు.

వేషంలోనుంచి వేషంలోకి మారటం వల్లేరు మీద బండినడకే వీరికి. ప్రతాపరుద్రీయంలో యెన్ని వేషాలు వేసేవాడో, యెంతతొందరగాతో,చాకచక్యంతో మారేవాడో అందరికీ తెలిసినసంగతే. ఒకటిరెండుమార్లు మొదటిసీనులో రామప్పంతులు వేషం మార్చుకొని, అగ్నిహోత్రావధాన్లు భార్య వెంకమ్మగా వెంటనే సీనులోకి తయ్యారైయ్యేవాడు. వెంకమ్మ వేషగాడు అప్పుడప్పుడు ఎగగొట్టేవాడు. ఆ కొరత ఉండేదిగాదు. ఇంతస్వల్పకాలములోనే పెద్దబొట్టు పెట్టుకొని, చీర కట్టుకొని, అతివినయంగా, కూరలు తరుగుతూ కూర్చొని పాతివ్రత్యం ఉట్టిపడేట్టుగా అభినయించేవాడు. మళ్లా నిమిషాలమీద రామప్పంతులుగా మారేవాడు. ఇప్పటికీ చాలామంది ప్రేక్షకులకు యీ "అవాంతరపు వెంకమ్మ" మాఅంజే యని తెలియదని నానమ్మకం.

ఒకసారి ప్రతాపరుద్రుడు, పేరిగాడు; తర్వాత కొన్నిసార్లు పేరిగాడిపాత్ర అనన్యసామాన్యంగా నటించాడు. వేషంరీతే మార్చి కొత్తపోకడలు పోయ్యాడు. కొత్తఅర్థాలు తీశాడు. కొత్తభావాలు విశదీకరించాడు. రాజువేషంలో చెవికి ఒకకాడలాంటిఆభరణం తయ్యారుచేసి పెట్టుకున్నాడు. ఒక్కొ దానితోనే ప్రతాపరుద్రుడనవచ్చు. "ఎప్పుడు చేశావురా దీన్ని" అంటే, "సంవత్సరమైంది. యీవేషం మీ రప్పుడో నాకకసార్లెత్తుగా తగిలిస్తారని నాకు తెలుసు" అన్నాడు. ప్రతివేషానికి, అంతెందుకు, ప్రతి లక్షణంచేవస్తువుకు, స్త్రీకి సహా, యేదో ఒకటో, అప్పిగేరెండో సుందరతనామైనట్టియూ, రసోత్పత్తి నిచ్చేటట్టియు ఆభరణములో, కొన్ని నెలవులో ఉంటాయి. వాటిని తీసివేసి గాని, మాసిపోసి గాని చూస్తే జీవరసం పోయినట్లుగా మనకు తేటతెల్లముగా కనబడుతుంది. ఉదాహరణలు ఎన్నియైనా యివ్వవచ్చు. ఎంతో గొప్పనటుడైతే గాని వీటిని పసిపట్టటం కష్టం. "వసంతసేన వేషం వేస్తావురా అంజీ" అని అడిగితే, తాను కొంచెము పొడుగు, లావు తక్కువ అని, సరియైన విగ్గు, చీర దొరకటం కష్టం అని, సొమ్ములు తయారు చేసుకొనే సరికి ఆరునెలలు పడుతుంది అని, మిగతావిషయాలకు ఏమి భయము లేదని ఒకమారు చెప్పాడు. ఎంత చిన్నవేషమైనా గొప్ప పరిశీలన చేసేవాడు. చాలాసార్లు యితరులకు పరిశీలించిపెట్టేవాడు. 'రోషనార'లో వీరి దావూద్ వేషం చూస్తే వీరి జాగ్రత్త బోధపడుతుంది.



మాష్టరుఅంజి:
'రోషనార' నాటకంలో 'దావూద్' పాత్ర:
('రోషనార'ను చూసినప్పుడు) "హాద్యాడ్ వస్తున్నాడు."

వీరికళాకౌశలాన్ని గురించి ఎంతైనా చెప్పవచ్చు. కాని యిప్పటికే చాటభారతం అయిందని భయం వేస్తుంది.—అన్నట్టు వీరిజీవితం అభిమన్యుడిని తలపుకు తెస్తుంది.

శూద్రవాడైనా అభిమానవంతం కలవాడు. జంకు గొంకు లేదు. నిరుపేదవాడైనా ఎవరినీ దేనికీ దేబిరించేవాడు కాడు. పండ్లు బిగపట్టి, చిత్తం చెడనకుండా ఎన్నికష్టాలైనా పడేవాడు. రెండురోజు లన్నము దిన కుండా ఉన్నా మా కెవ్వరికీ తెలిసేది కాదు: కాని నాస్నేహితులు డాక్టరు చంద్రమౌళి సత్యనారాయణ రావుగారు కనిపెట్టి, తగినది చేస్తూవుండేవారు. వీడి నోటిగుండా ఎప్పుడూ అబద్ధం అనేది నే నెరుగను. నమ్మకం విశ్వాసంలో వీడితర్వాతనే యెవరైనా. దేనికైనా, పైసాలతో సహా లెక్క అప్పజెప్పేవాడు. కష్టపడనిదీ కానీ వద్దైనా హేయం అనేవాడు. ఆకలిబాధ—సంసారబాధ—పడేటప్పుడు రెడ్డిగారి 'ఉమ్రాఖయ్యాం'లోనిది "అంతము లేని యీ భువన మంత పురాతనపాంథశాల" అనేపద్యమూ, కొడవటిగంటి సుబ్బయ్యగారి 'భిక్షువు'లో "భువిని గల సర్వవస్తువుల విడిచి దండము ధరించు జడదారి నేను రాత్రి యేమి దివంబేమి రాజమార్గమేమి శ్మశానవాటిక యైన నేమి నాకు" అనేపద్యమూ గాంభీర్యమైన గద్గదికతో చదివేవాడు. నిజంగా నాపంచప్రాణాల్లో ఒకడు వీడు: వీడు లేని కొరత నాలోను, మాసభలోను ఎప్పుడు కనబడుతూ ఉంటుంది.

వీడు పెండ్లి జేసుకోలేదు. నే నెప్పుడడిగినా, "యిరవైయొనిమిదవయేట మరణం నాకు" అనేవాడు. వీడినమ్మకము అర్థమైయ్యేది కాదు. ఎవడో కేరళపక్షి గాడు చెప్పాడు అనేవాడు పైగా. ఎగతాళిపట్టించేవాణ్ని. యీరాత్రి నన్నే ఎగతాళిపట్టించాడు. లగ్ననిశ్చయము అయిన వీడి పెద్దమేనమామ కూతురు సంబంధము ఆరు సంవత్సరాల్నాడు వీడు విఘాతం చేశాడు. 'రేపు' అనగా చెన్నపట్నం పారిపోయాడు. "నీపిల్లను చేస్తే వెధవరాలవుతుంది, యిరవైయొనిమిదవయేట పోయేవాణ్ని, నామాట నమ్ము" అని మేనమామతో చేతులుపట్టుకొని బ్రతిమాలుకొని ఏడుస్తూ చెప్పాడట. యీపూర్వగాథ ఆయనగారు నాతో చెప్పుతున్నాడు: ఇంతలో యింట్లో ఘొల్లుమన్నారు; లోపలికి పొయ్యేసరికి అంతా అయిపోయింది.

వీడికని యిరవైరోజులు శ్రమదమాలుపడి అయాచితంగా తనకాళ్లున్నంతా ధారపోసిన 'రాజు' అనే దక్షిణాదివైద్యుడు యీరాత్రి రాలేదు. వీడిముఖము చూడడానికి భయమువేసిందట.

ఆఖరుచూపు చూద్దా మనుకొన్నాను. "వెళ్లుతున్నా అంటే!" అనబోయ్యాను: ముఖములో కళ యేమైనా తప్పితేగా! చిత్తాన్ని బిగబట్టే యీతుచ్ఛశరీరాన్ని వొదిలాడు: అదృష్టవంతుడు.

దీనిని యిక వ్రాయటం ఆపివేస్తాను. ఆకాశంలో నిండుచంద్రుడేమో పరుగెత్తుక పోతున్నాడు. వాడేమో ఉత్తరానికి——————.

శ్రీరామ, రామ. ఓమ్ శాంతిః శాంతిః.

---

# నాటకాల ఉత్తరం

ప్రతివాదిభయంకరం రంగాచార్యులుగారు

"The ignorance of the actor is only to be surpassed by the ignorance of the audience."—T. Raghavachary.

"నటకుల తెలివిమాలినతనాన్ని మించగలిగింది మళ్లీ ప్రేక్షకుల తెలివిమాలినతనం ఒక్కటే."—టి. రాఘవాచారి గారు.

మా బావకు నాటకాలంటే మా పెద్దపగదా. అతని పరదాకు తగినట్టు, ఆమధ్య అతడు క్రిస్టమస్ రోజుల్లో మదరాసు వచ్చి దిగిన సమయంలోనే ఆంధ్రమహాసభవారి నాటకాలుకూడా కలిసివచ్చాయి. 81 వ తేదీ నాడు నాటకం చూచి వచ్చాము, మర్నాడు ఉదయం ఎక్స్‌ప్రెసులో మళ్లీ ప్రయాణమైనాడు. నాటకాలనుగూర్చి సావకాశంగా ఒక్కనాడూ నాతో మాటాడిందే లేదు. కాని అక్కడికు పోయినతర్వాత, ఇక ఉండబట్టక కాబోలు, నాకొక నాటకాలఉత్తరం పారేశాడు. అందులో వ్రాసిన యీక్రింది విషయాలన్నీ ఆనాటకాల నాలుగురాత్రుల్లో అప్పు

దప్పుడు తాను ప్రేక్షకులనుండి నేర్చుకున్నాట్ట. ఆమాటలను బట్టీపట్టి మరీ వ్రాశా డనుకొంటా నాకు.

* * *

"ఎవరండీ స్వామీ ఆయన?"

"రాధాకృష్ణయ్యగారు."

"అది కాదు. అవ లెవరని."

"భీష్ముడు."

"అంటే?"

* * *

"(రంగస్థలంమీదనుంచి) అతివా దాపగ నేల... బింబాధరా."

"వన్స్‌మోర్."

"ఉండు. ఉండు. ఉండవయ్యా!"

"ఏం ఉండవయ్యా?"

"మళ్లీ ఎట్లా పాడతాడయ్యా?"

"దమయంతి నలుడురూపం పోల్చుకొని లోపలికి చక్కాపోయిందయ్యా అప్పుడు. మళ్లీ వన్స్‌మోర్ విని, బయటికి వచ్చి, నలుణ్ణింకొకసారి పరకాయించి వెళ్లిందా మరి?"

"ఏమిటిదయ్యా యిది? బాగున్నప్పుడు కాకపోతే మరెప్పుడు పాడుతా డంటా!"

* * *

"ఏమిపాటలో! 'నీలవేణీ వాణీ శారదా'. ఏంపాడేశిందయ్యా? ఇదుగో చూడు, ఇదీ పాట. ఆఁ...... 'నీలవేణీ వాణీ శారదా.'"

"ఉష్. ఉష్. ఉండవయ్యా. అక్కడ స్టేజీమీద ఎవరో యేమిటో చెబుతున్నారు విననీవయ్యా."

"రాఘవాచారి మంచి ఏక్టరట కాదూ."

"(ఆక్షేపణపూర్వకంగా)ఆ. గొప్పఏక్టరే. ఆయన నోరు విప్పందే పాట."

* * *

"తోశారు. తోశారు."

"ఏమిటి? ఏమయిం దేమిటి?"

"కలిపురుషుడూ లేడు; జూదమూ లేదు ఒక్కసారి తోశారు అడవిలోకి."

'ఎరక్కపోయి కొన్నాం సీజను,రూపాయిన్నర!'

'ఇదంతా యెందుకో తెలుసునా? ఆ బెల్లంకొండ సుబ్బారావుని యెల్లాగయి నా స్టేజిమీదికి లాక్కొద్దామని'

'ఉండూ ఉండూ,అక్కడ వాళ్లేమిటో మాట్లాడుతున్నారు......నలుడూ దమయంతీ ఉద్యానవనంలోనోయి.'

'పాపం తో శెయ్యలేదురా.'

* * *

(రంగస్థలంమీద విరూపుడైన నలుడు.) 'హా! ఈ పాము నన్నింతగా కరచినది?'

'అదుగో బాహుకుడు.'

'బెల్లంకొండ......'

'రాఘవాచారి.'

'సుబ్బారావురా.'

'రాఘవాచారిరా.'

'అబ్బ! ఏంగొడవయ్యా యిం!'

* * *

'ఏమిటివి కద?'

'............. ..'

'గా దిప్పుడే భోంచేసి వచ్చాలే యింటికాడనుండి. అంచు కడుగుతుండా.'

'చిత్రనళీయం.'

'అదుగో, ఆయనే ఒకవకీలు. వకీలు.'

'...............'

'ఆంధ్రమాసభ మెంబరు.'

'..............'

'బలే తమాషాగాళ్లే'

'ఇష్కు, ఏమిటయ్యా, నన్ను వదల వింకా!'

* * *

'ఉత్తరాది నీపాటలూ పద్యాలూ పాడితే ఊరుకుంటారటండీ?'

'ఈపద్యాలన్నీ (ప్రహ్లాద నాటకంలో పాడేవి) చాలాభాగం భాగవతంలోవే నాయెను. ఉత్తరాదిదీ పోతన్న భాగవతమే, ఇక్కడిదీ పోతన్న భాగవతమే మరి.'

'సరే కాని, మన్లో మనమాట, రాఘవాచార్లుగారంత గొప్ప ఏక్టరుంటారే, ఏంఏక్టరు చెప్పండి?'

'ఏం? మీకు నచ్చలేదా యేమిటి? నిజమే లెండి, చాలామందికి రాఘవాచార్లుగారు నచ్చరు.'

'ఏమిటో, ఏమిపాటో, ఏమిఏక్టరో. మన ఉత్తరాది నయితేనా, జమాయించి పాడరూ? ......అరెరె. ఆబండబ్బాయిని చూడ్రా—సీమసుద్దేలి సేస్తున్నాడ్రా. అహ్హహ్హహ్హ. బలేఏక్టర్రా.'

* * *

ఇంకా ఈలాంటివి చాలా సేర్చుకున్నాట్ట మా బావ నాటకాలు చూచే సమయంలో. 'అన్నీ జ్ఞాపకానికి రావడం లేదు ప్రస్తుతం. జ్ఞాపకం తెచ్చుకొని మరొకసారి వ్రాస్తా' నన్నాడు.

---

# ప్రశ్రయము

కె. అన్నమరాజశర్మ గారు

ప్రణయినీ! అమృతాంచిత ప్రభల నీను
నీ కపోలంబులందున నృత్యమాడు
రక్తిమాంకూరముల రాగ రసము చింద
నిడుతునే నేడు ముద్దుల గడుగకుండ ?

రామణీయేందుపాండు రాత్రులందు
మాధవీలతాగృహాంకముల మాటు నిల్చి
వీణ సవరించి భావాతివేలమైన
ప్రేమగీతంబుఁ బాడఁగా వేగ రమ్మ.

బొండుమల్లెల తావులు నిండుకొనిన
కొండ కోనలఁ జరియింప కోర్కె గలదొ
వనకురంగీవిలోచనా! భయము దక్కి
రమ్ము నాతోడ ప్రణయసామ్రాజ్య మేల?

చెలులు కోరంచు సుంతయుఁ జింత వలదు
తరళనేత్రలు హరిణకాంతలు నిరంత
రంబు నిన్నుఁ గూడి మోహనారణ్యసీమ
లీలమై నడతెంత్రు శంపాలతాంగి!

లేఁతమామిడి కొమ్మల కూఁత లిడుచు
గండుకోయిల జపియించు గానమునకు
కల్పనముఁ జేసి యర్థముల్ కవిని గాన
పాటలాధర! వినిపింతుఁ బ్రతిదినంబు.

పవలు రేలకు భేద మేర్పడక శ్రావ్య
రాగములఁ జిల్కు సెలయేటి రావములరు
రమ్యసికతాస్థలంబుఁ జేరంగ రమ్ము;
అబల! వచియింతు నందు రహస్య మొండు.

"మల్లెపువ్వులు"

---